హెచ్‌సీయూలో ఉగాది వేడుకలు

రాయదుర్గం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు సంవత్సరాది వేడుకలను అందరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీసీసీ శేరిలింగంపల్లి ప్రతినిధి సత్యనారాయణరావు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరివెంకట్, రాష్ట్ర ఇన్‌చార్జి అక్షయ్ లక్రా, జాతీయ కోఆర్డినేటర్ ఆజమ్ పాల్గొన్నారు.

భారత్ మార్కెట్‌పై అమెరికన్ యూనివర్సిటీ దృష్టి

- అమెరికన్ యూనివర్సిటీ అధ్యక్షుడు మార్క్‌పిక్రిస్టెన్‌సెన్



సమావేశంలో పాల్గొన్న మార్క్ పి క్రిస్టెన్‌సెన్, ఇతర ప్రముఖులు

రాయదుర్గం: భారత్ మార్కెట్‌పై పురాతన అమెరికన్ యూనివర్సిటీ ప్రత్యేక దృష్టి సారించిందని అమెరికన్ యూనివర్సిటీ అధ్యక్షుడు మార్క్ పి క్రిస్టెన్‌సెన్ పేర్కొన్నారు. గచ్చిబౌలి స్కైవ్యూలోని కోవర్క్స్‌లో ఇండో గ్లోబల్ స్టడీస్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడారు. భారత్ చాలా పెద్ద దేశమని, విదేశాలలో చదువుకోవడానికి ఇష్టపడే విద్యార్థులకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఏటా 60 మిలియన్ల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్ అవుతున్నారని భాతరదేశం నుంచి ప్రతియేటా దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు వెళ్తున్నారన్నారు. క్లార్క్సన్ క్యాంపస్‌లో 1964లో మొట్టమొదటి భారతీయ విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించారని గుర్తు చేశారు. గ్లోబల్ యూనివర్సిటీ కావాలనుకుంటే భారతీయ విద్యార్థులకు ముఖ్యంగా తెలంగాణ నుంచి రిక్రూట్ చేసుకోవడం అవసరమన్నారు. భారతదేశం నుంచి క్లార్క్సన్ విద్యార్థుల దరఖాస్తులు గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు 171 శాతం వృద్ధిని పెంచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇండో గ్లోబల స్టడీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అశోక్‌కల్లం, యూనివర్సిటీ ప్రతినిధి భారత సంతతికి చెందిన సీమా గ్రోవర్ క్రిస్టెన్‌సర్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం

ఏఈ శ్రీనివాస్‌తో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ



మాదాపూర్: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తలెత్తుతున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐటీ ప్రాంతం కావడంతో కంపెనీలు, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉండడంతో తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉంటూ హెచ్చుతగ్గులు లేకుండా చూస్తున్నారన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరా, అంతరాయాలపై ఏఈ శ్రీనివాస్‌తో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ.

మాదాపూర్‌లో ఎన్ని ఫీడర్లు ఉన్నాయి? వాటికి మరమ్మతులు ఎలా చేస్తారు?

మూడు సబ్‌స్టేషన్లు, 14 ఫీడర్లు ఉన్నాయి. వీటిని ఎప్పుడు నైపుణ్యం కలిగిన సిబ్బంది పర్యావేక్షిస్తూ ఎప్పటికప్పుడు కావాల్సిన ఫీజులను మారుస్తారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రధాన ప్రాంతాలలో ప్రమాదకరంగా ఉంటే వాటికి కంచె ఏర్పాటు చేసి ఫీజు బాక్సులను ఏర్పాటు చేస్తున్నాం.

ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి?

మొత్తం 922 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. ఐటీ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది ఉద్యోగులు, దానికి తోడు అపార్ట్‌మెంట్ల సంఖ్య పెరుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లకు 5 సంవత్సరాల వారంటీ ఉంటుంది. దాని తర్వాత వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మెరుగైన సరఫరా అందిస్తున్నాం.

విద్యుత్ హెచ్చుతగ్గులను ఎలా నివారిస్తారు?

విద్యుత్ హెచ్చుతగ్గులు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమస్యలు వచ్చినప్పుడు వెంటనే సంప్రదించాలి, లేదా అత్యవసర విభాగానికి ఫోన్ చేయాలి. ఎప్పటికప్పుడు ట్రీ కటింగ్, నెలలో ఒకసారి పూర్తిస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తుంటాం.

విద్యుత్ ఆదా చేయడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అవసరమైనంత వరకే విద్యుత్‌ను వాడుకోవాలి. ఫ్యాన్లు, లైట్లు, ఎప్పటికప్పుడు ఆన్ ఆఫ్ చేసుకోవాలి. బయటికి వెళ్లినప్పుడు దాదాపుగా అన్ని స్విచ్‌లను ఆపివేయాలి. లేదంటే ఒక్కోసారి విద్యుదాఘాతం సంభవించే ఆస్కారం ఉంటుంది.

తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయం



రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత పాత్రపై మల్లన్న గత కొన్ని రోజులుగా చేస్తున్న విమర్శలను తట్టుకోలేక అరెస్ట్ చేసి జైలుకు పంపడం పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులు కూడా తెలంగాణలో స్వేచ్ఛగా పని చేయలేని పరిస్థితి వచ్చిందని జర్నలిస్టులంతా ఆలోచించాలని సూచించారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే గాంధీ



కాలనీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే గాంధీ సానుకూలంగా స్పందించినట్లు టీఎన్‌జీఓకాలనీ రంగారెడ్డి జిల్లా హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య తెలిపారు. గురువారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాలనీకి మంజూరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు పనులను ప్రారంభించాలని కోరగా అందుకు ఆయన అంగీకరించారన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ శంకరయ్య, డిప్యూటీ కమిషనర్ వెంకన్నను కూడా కలిసి కాలనీలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి, ముష్కి చెరువును సుందరీకరించాలని, కాలనీలో ఇక్కట్లు లేకుండా చేయాలని కోరగా వారు కూడా సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే గాంధీని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా అన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జోసెఫ్, రాములు, నర్సింహులు, ఆశ్రఫ్, జోగారావు, ప్రభాకర్‌రావు, భాస్కర్ ఉన్నారు.

జీవకోటికి నీరే ప్రాణాధారం



కరపత్రం విడుదల చేస్తున్న రాజశేఖర్

హఫీజ్‌పేట్ : సమస్త జీవకోటికి గాలి తర్వాత నీరే ప్రాణాధారమని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి కార్యాలయంలో జల దినోత్సవ అవగాహన పత్రాన్ని అసోసియేషన్ సభ్యులతో కలిసి జనరల్ మేనేజర్ రాజశేఖర్ ఆవిష్కరించి మాట్లాడారు. నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుందని అలాగే అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధాన ఆధారమన్నారు. శరవేగంగా పెరుగుతున్న జనాభాకు అంతే వేగంగా నీటి అవసరం కూడా పెరుగుతుందన్నారు. భూమిపై ఉన్న నీటి వనరులలో 97 శాతం సముద్ర జలాలే అన్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందక ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అనేక రోగాల బారినపడి ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, వృథాని అరికట్టడం, వర్షపు నీటిని సముద్రం పాలు కానివ్వకుండా చెక్ డ్యాం, ఇంకుడు గుంతలు, ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాల నీటి మట్టం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి.రావు, పాలం శ్రీను, జనార్ధన్, మల్లారెడ్డి, అమ్మయ్య చౌదరి, అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన రంగనాథుడి ఉత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లి, పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం రంగనాథస్వామి ఆలయ ఉగాది ఉత్సవాలు ముగిశాయి. రెండ్రోజుల ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజలతో ముగిశాయి. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి పల్లకిసేవను ప్రారంభించి గోపన్‌పల్లి ప్రాంతంలో డప్పువాయిద్యాలు, భాజాభజంత్రీలు, బ్యాండ్ మేళాలతో పెద్ద సంఖ్యలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గోపన్‌పల్లి, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొనగా నాట్య బృందాలు చేసిన నృత్యాలతో సందడిగా మారింది. అనంతరం ఆలయ రథోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఆలయ కమిటీ అధ్యక్షులు రవీంద్రప్రసాద్‌దూబే, ఆయా పార్టీల నాయకులు రవికుమార్ యాదవ్, కసిరెడ్డిభాస్కర్‌రెడ్డి, గజ్జల యోగానంద్, జైపాల్, సత్యనారాయణ, ఆలయ ప్రధాన కార్యదర్శి పోచయ్య, సభ్యులు అనీల్, నర్సింహ, కృష్ణ, స్వామి వారిని దర్శించుకున్నారు.

మనూలో ఘనంగా 'నౌరూజ్' పండుగ



ఐనుల్‌హసన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: సార్వత్రిక సోదరభావం, ఐఖ్యత, సమగ్రత, సంఘీభావాన్ని ప్రోత్సహించే 'నౌరూజ్ పండుగ'ను గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పర్షియన్ అండ్ సెంట్రల్ ఏషియన్ స్టడీస్ విభాగం(డీపీ అండ్ సీఏఎస్) ఆధ్వర్యంలో ఈ పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. నౌరూజ్ పండుగకు మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఈ పర్వదిన సాంస్కృతిక ప్రాముఖ్యతను విస్మరించలేమని స్పష్టం చేశారు. దక్కన్ ప్రాంతంలో నౌరూజ్‌పై గరిష్ట సంఖ్యలో ద్విపదలను రాయడంలో ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెనడాకు చెందిన ప్రఖ్యాత ఉర్దూ, పర్షియన్ కవి డాక్టర్ సయ్యద్ తఖీ అబేదీ పాల్గొని పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ నూర్ ఇంటర్నేషనల్ మైక్రో ఫిల్మ్ సెంటర్ సౌత్ ఇండియన్ స్టేట్స్ రీజినల్ డైరెక్టర్ అలీ అక్బర్ నిరూమండ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ అజీజ్‌బానో,డాక్టర్ సయ్యదా అస్మత్‌జహాన్, డాక్టర్ ఖైజర్‌అహ్మద్, ఎండీ రిజ్వాన్, డాక్టర్ జునైద్ అహ్మద్ పాల్గొన్నారు.

మనూ 'సోఫ్రే హాఫ్ట్‌సిన్ పట్టిక ఏర్పాటు



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సంప్రదాయబద్ధంగా 'సోఫ్రే హాఫ్ట్‌సిన్' పట్టికను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ సందర్భంగా ఏడు అంశాల అమరికతో పర్షియన్ సబ్జెహ్(గోదుమగడ్డి), సమాను (తీపిపుడ్డింగ్), సెర్కే(వెనిగర్) మొదలైన వాటితో ఇతర తీపి పదార్థాలు, పండ్లను ఒక టేబుల్ ఏర్పాటు చేసి దానిపై అమర్చడం విశేషం. ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఆయన సతీమణి అర్షియా హసన్ తిలకించి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ ఉర్దూ, పర్షియన్ కవి డాక్టర్ సయ్యద్ తఖీఅబేది, అలీఅక్బర్ నిరూమండ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొన్నారు.

సీఐ దాతృత్వం




యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లితో రాంబాబు

పటాన్‌చెరు టౌన్: నల్గొండ జిల్లా...నిడమనూరు మండలం ముకుందాపురంనకు చెందిన రాంబాబు కూలీ పనులు చేసుకుంటూ తల్లి వెంకటమ్మ, చెల్లిని పోషించుకునేవాడు. తల్లి ఆరోగ్యం క్షీణించడంతో బెంగతో కుమిలిపోయాడు. చివరకు చేసేదేమి లేక చెల్లి పెళ్లికోసం తెచ్చిన బంగారం అమ్మి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తల్లి వెంకటమ్మను చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లాడు. మరునాడే మళ్లీ అనారోగ్యం క్షీణించింది. దీంతో చేతిలో చిల్లిగవ్వలేక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ వైద్యులు(ఎండోస్కోప్, ఆర్పీసీ స్కాన్) వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. దీనికి దాదాపు రూ. లక్షకు పైగా ఖర్చవుతుందని తెలుసుకుని కుదేలైపోయాడు, గుండెలు బాదుకొని రోదించాడు. చేసేది లేక దిగాలుగా ఉన్న సమయంలో అతని స్వగ్రామానికి చెందిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి పటాన్‌చెరులో పనిచేస్తున్నాడని తెలుసుకున్నాడు. వెంటనే ఆయనకు ఫోన్‌చేసి కన్నీరు మున్నీరుగా రాంబాబు విలపించాడు. తల్లికోసం అతను పడుతున్న ఆవేదనను చూడలేక వెంటనే అతనికి లక్షకు పైగా ఆర్థిక సాయం చేశారు. ఈ విషయంలో రాంబాబు సీఐ చేసిన సాయానికి జీవితంలో మర్చిపోలేనన్నాడు. యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తల్లికి చికిత్స నిమిత్తం సీఐ దేవుడిలా ఆదుకున్నాడని ఆయన చేసిన సహాయాన్ని వాట్సాప్ గ్రూప్‌లో పెట్టడంతో సోషల్ మీడియాలో అదితెగ చక్కర్లు కొడుతుంది.

పీజేఆర్ స్టేడియంలో స్పోర్ట్స్ ప్రారంభం

మియాపూర్: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీర దారుఢ్యానికి దోహద పడుతాయని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్స్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆయన జోనల్ కమిషనర్ శంకరయ్య, డిప్యూటీ కమిషనర్లు వెంకన్న, సుధాంశ్, కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సింధు ఆదర్శ్‌రెడ్డి, ఏఎంఓహెచ్ కార్తీక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరు జీవితంలో విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

కథనం చదివి.. పరిష్కారానికి కదిలి



డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు (ఫైల్)



డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసిన తర్వాత ఇలా..

రాయదుర్గం: మధురానగర్‌లో రోడ్డుపైకి పొంగిన మురుగునీటితో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ సమస్యపై గురువారం 'పొంగిన డ్రైనేజీ..రోడ్డంతా మురుగుమయం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

సాక్షి ఎఫెక్ట్..



జన్మదిన
శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
శ్రీ మారబోయిన రాజుయాదవ్ గారు
శిరీష ఎస్టేట్స్ ప్రయివేట్ లి., చైర్మన్.
నవయుగ నేత, జనహృదయ నాయకుడు,
శేరిలింగంపల్లి నియోజకవర్గం యువకెరటం
స్నేహశీలి, త్యాగశీలి, నిగర్వి, మాకు మార్గదర్శి
శ్రీ మారబోయిన
రఘునాథ్ యాదవ్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ మారబోయిన రఘునాథ్, MBA
తెలంగాణ రాష్ట్ర బిజెవైయం కోశాధికారి
మారబోయిన సాయిరాంయాదవ్
శిరీష హోం ప్రయివేట్ లి. మేనేజింగ్ డైరెక్టర్
శేరిలింగంపల్లి అసెంబ్లీ, కొండాపూర్ డివిజన్ బిజెపి నాయకులు,
కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు.
SIRISHA
Group
Ventures at
Hyderabad | Sangareddy |
Zaheerabad